# కాంపిటీషన్

"జీవితంలో కాంపిటీషన్ లేకపోతే ప్రగతి లేదు! థ్రిల్ లేదు! రొటీన్ లైఫ్ నిస్సారంగా సాగిపోతుంది. ఒకరితో ఒకరికి పోటీ వున్నప్పుడే ఒకరిని అధిగమించాలని ఒకరు ప్రయత్నించి వారి వారి శక్తి సామర్థ్యాల్ని ప్రదర్శించుకుంటారు. ఒక వ్యక్తి యొక్క శక్తి బహిర్గతం, కావాలంటే ఆ టాలెంటుకి సరిపడ పోటీ వుండాలి. అయితే ఆ పోటీ అసూయతో కూడుకున్నది మాత్రం కాకూడదు. తాను అందరినీ అధిగమించి పైకిపోవాలని కోరుకోవచ్చును. కానీ అందరూ సర్వనాశనం అయిపోయి తను మాత్రమే బాగుండాలని కోరుకోకూడదు. అవతల వారిని పడగొట్టి తనుమాత్రం ఊరేగాలనుకునే మనస్తత్వం చాలా ప్రమాదకరమైనది. అవతలి వారి ప్రగతిని చూసి ఏ మాత్రం ఓర్వలేని వాళ్లు వాళ్లని ఏం చెయ్యడానికైనా సిద్ధపడతారు. ఆ అన్వేషణలో తమ అమూల్యమైన కాలాన్ని వృధా చెయ్యడమే కాకుండా, అవాంఛనీయమైన కార్యాలెన్నిటికో పునాదులు వేసి, సఫలీకృతులైతే అవతలి వారి నాశనాన్ని కళ్లజూస్తారు. లేకపోతే తమ నాశనానికి తామే కారకులౌతారు. ఈ అసూయతో కూడుకున్న, పోటీలు ఒక్కొక్కసారి తమాషాగా అనిపిస్తాయి కూడా. ఉదాహరణకి జాయింటు ఫామిలీలో తోటి కోడళ్లని తీసుకుందాం.

"ఈ చీర మా అమ్మ వాళ్లు ఇచ్చారు" అని గొప్పగా చూపిస్తుంది ఒక కోడలు.

"అంత మంచి చీరె!" అనుకుని మూతి విరుస్తుంది మరో కోడలు. పైకి మాత్రం "ఏమంత బాగులేదు చీర, ఓ మోస్తరుగా వుంది! ఫరవాలేదులే" అంటుంది. కానీ భర్తతో మాత్రం పోరుపెట్టి అలాంటి చీరకొనిపించుకొనేవరకూ నిద్దరపోదు, తిండితినదు. తనూ కొనుక్కున్నాక కాస్తైనా పొగడ్డం మొదలెడుతుంది! "ఏమో అనుకున్నాను. చీర బాగానే వుంది అందుకే నేనూ అలాంటిదే కొనేసుకున్నాను" అంటుంది.

మరొక ఉదాహరణ ! పక్కింటి ఆంటీ వాళ్లూ ఏదో వాళ్ల అవసరాల కొద్దీనో లేకపోతే చవగ్గా వొచ్చాయనో కొందనుకోండి. వెంటనే డబ్బున్నా

లేకపోయినా అరువు పెట్టయినా సరే ఆ చీరలప్పుడు అవసరం లేకపోయినా సరే వెళ్లి కొనుక్కొచ్చేసి పోటీగా తనూ అందరికీ చూపించేసుకుంటారు.

వాళ్లింట్లో టి.వి. రాగానే వీళ్లూ వెంటనే వెళ్ళి టి.వి. కొనెయ్యాలి. వాళ్లు కలర్ టి.వి. కొనుక్కుంటే వీళ్లూ కొనేసుకోవాలి. వాళ్ల గార్డెన్ లో గులాబీ చెట్లు హైబ్రీడు వెరైటీ వేస్తే వీళ్లూ వెంటనే వేసెయ్యాలి! వాళ్లు పైన ఫ్లోరు వేసుకుంటే వీళ్లూ వెంటనే వేసెయ్యాలి! ఈ రకమైన కాంపిటీషన్ లో పెద్ద ప్రమాదాలు లేకపోయినా, దుబారా ఖర్చు వుంటుంది. వేస్టేజ్ ఎక్కువుంటుందన్నమాట. అంతేకాదు ఆర్థిక సమస్యలను మించిన మెంటల్ టెన్షన్ వుంటుంది. ఎందుకంటే వీళ్లకెంతసేపూ అవతలి వాళ్లు ఏం చేస్తున్నారూ అన్న ఆలోచనే ఎక్కువ! టైమంతా దీనికే అయిపోతుంది. వాళ్లకి నిజంగా అవసరమయిన విషయాలను గురించి ఆలోచించడానికిగానీ, ఆదరించడానికి వ్యవధి వుండదు. ఈ రకమైన కాంపిటీషన్ లో కొన్నిపాళ్లు అసూయకూడా మిళితమై వుంటుంది. తనకి లేదన్న బాధకన్నా అవతలివాళ్లకి ఉన్నదన్న బాధ వీళ్లని కాల్చేస్తుంది. ఈ మనస్తత్వం కలవాళ్లు, బంధుత్వాన్ని కూడా లెక్కజెయ్యరు.

పరోపకారం పద్యాలలో భవభూతి గారు వివరించినట్టు నాకు లేకపోయినా అవతలి వారికి అన్నీ ఇచ్చి రక్షించు ప్రభూ అనే ఉత్తమ స్థాయిలో ప్రతివారు ఆలోచించలేక పోవచ్చు. కానీ నేనూ బాగుండాలి. వాళ్లూ బాగుండాలి అనే మధ్యేమార్గంలో ఆలోచించొచ్చుగా! అది అందరికీ శ్రేయస్కరం! అంతేకానీ, నాకేమీ లేకపోయినా ఫరవాలేదు, కానీ అవతలి వారికి మాత్రం ఏమీ వుండ కూడదు స్వామీ' అని ప్రార్థించే అథమ స్థాయిలో మనం వుండకూడదు!

తెలిసింది కదా! ఆరోగ్యకరమైన కాంపిటీషన్ మనకి కావాలి! కానీ ఇటువంటి అధమగతి ఆలోచనలు మనలో రానివ్వకూడదు! అప్పుడే మనం మన టాలెంటుని పెంపొందించుకుంటాం. మనశ్శాంతితో బతుకుతాం. మనని మనం అభివృద్ధి పరచుకుంటూ ఇతరులకీ, ఇతర కార్యక్రమాలకీ కూడా తోడ్పడుతాం! బాబూ సుమన్! ఈ వ్యాసం నువ్వు చక్కగా చదివి అర్థం చేసుకుని మీ స్కూలు వక్తృత్వపోటీలో బహుమతి గెలుచుకుంటావని ఆశీర్వదిస్తూ పంపుతున్నా. ఫలితాలు రాగానే లెటర్ రాయి. హాస్టల్ భోజనం అదీ జగర్త! ఉంటామరీ. మీ అమ్మ మీనాక్షి దీపక్!

*